కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
గురువారం • 02-04-2026
పేజీలు: 3

360° SINGLE TOPIC

ట్రంప్ ఎఫెక్ట్

# తలతిక్క ట్రంప్



## అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలతో ఇండియన్స్‌కు ఇక్కట్లు

- ‘టారిఫ్’ దెబ్బతో కుదేలైన బిజినెస్
- యూఎస్‌లోని ఎన్నారైల పర్చేసింగ్ పవర్‌పై ఎఫెక్ట్
- ఇరాన్‌పై యుద్ధంతో వంటింట్లో గ్యాస్ కష్టాలు
- కమర్షియల్ ఎల్పీజీ షార్టేజీతో గిగ్ వర్కర్ల గిరాకీ డౌన్
- ‘హెచ్-1 బీ’ రూల్స్‌తో భారత టెకీలకు చిక్కులు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు ఆ దేశానికే పరిమితం కాలేదు. ‘తను చెడ్డ కోతి వనమెల్లా..’ చందంగా ఆయన ప్రకటించిన ‘టారిఫ్’ ప్రభావం అన్ని దేశాలపై పడింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదు. మరోవైపు అమెరికాలో ఉంటున్న ఇండియన్స్ కూడా టారిఫ్ కష్టాలు ఎదుర్కోక తప్పలేదు. ఆయన ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అయోమయం కంటిన్యూ అవుతున్నది. ఏ క్షణం ఎలాంటి బాంబ్ పేలుస్తారోనన్న టెన్షన్ వెంటాడుతున్నది. ఇక హెచ్-1 బీ వీసా రూల్స్ మార్చడం, ఇరాన్‌పై కాలుదువ్వడం.. ఇలాంటి నిర్ణయాలు మొత్తం ప్రపంచ దేశాలనే ఇబ్బందుల్లోకి నెట్టింది.

ట్రంప్ టారిఫ్‌లతో నిజామాబాద్ పసుపు మొదలు వరంగల్ మిర్చి రైతుల వరకు ఏదో ఒక రూపంలో కష్టాల్లో పడ్డారు. ఇండియా నుంచి సరఫరా చేసే పప్పు, ఉప్పు, బియ్యం సహా అనేక వస్తువులపై టారిఫ్ పేరుతో భారీగానే అమెరికాకు చెల్లించుకోక తప్పలేదు. దీంతో అమెరికాలోని ఇండియన్స్ సైతం మూడు నాలుగింతలు ఎక్కువ చెల్లించి వాటిని కొనాల్సి వస్తున్నది. సుంకాలపై అమెరికా సుప్రీంకోర్టు షాక్ ఇచ్చినా ట్రంప్ తీరు మారలేదు. హెచ్-1 బీ వీసా రూల్స్‌లో ఇష్టమున్నట్లు మార్పులు చేయడంతో అమెరికాలోని ఇండియన్స్ ఇక్కడికి రాలేక.. తమ వాళ్లను చూసేందుకు ఇక్కడివాళ్లు అక్కడికి వెళ్లలేక ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ కంపెనీలు ఉద్యోగాల్లో కోతలు పెడుతున్నాయి. ఇండియన్ టెకీల జాబ్ ఎప్పుడు పోతుందో తెలియని గందరగోళం. క్షణ క్షణం భయంతో గడపాల్సి వస్తున్నది.

ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధాన్ని మొదలుపెట్టిన ట్రంప్.. చాలా దేశాలను పెట్రోల్ సంక్షోభంలోకి నెట్టారు. ఇండియాలో ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ కష్టాలకు కారణమయ్యారు. దీంతో గల్లీల్లో రోజువారీగా హోటళ్లలో పనిచేసే కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకమైంది. గ్యాస్, పెట్రోల్ కొరతతో హోటళ్లు మూతపడ్డాయి. ఫుడ్ డెలివరీ బాయ్స్‌కు చేతిలో పని లేకుండాపోయింది. నిత్యావసర వస్తువుల రేట్లు పెరిగిపోయాయి. వంటింట్లో సిలిండర్ డెలివరీలు తగ్గిపోయి కట్టెల పొయ్యే దిక్కయింది. పొట్టచేత పట్టుకొని గల్ఫ్ దేశాలకు వెళ్లిన తెలంగాణ వాసులను ట్రంప్ నిర్ణయాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకవైపు శాంతి దూతగా తనను మించినవారు లేరని, ‘నోబెల్ పీస్ ప్రైజ్’కు తానే ఏకైక అర్హుడినని చెప్పుకుంటూనే వెనెజువెలాపై సైనిక చర్య జరిపి ఆ దేశ అధ్యక్షుడిని నిర్బంధించారు. తాజాగా ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నారు. మెక్సికోతో ఘర్షణలకు కారకులయ్యారు.

‘మేక్ అమెరికా.. గ్రేట్ అగెయిన్’ అంటున్న ట్రంప్.. సొంత దేశాన్ని కూడా ప్రశాంతంగా నిద్రపోనివ్వడం లేదు. అమెరికా చరిత్రలోనే అత్యంత చెత్త అధ్యక్షుడిగా రికార్డును మూటగట్టుకున్నారు. ఇతర దేశాలతోపాటు అమెరికాలోనూ డొనాల్డ్ ట్రంప్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనేక నగరాల్లో బహిరంగంగానే ఆయనకు వ్యతిరేకంగా ప్రజలు ర్యాలీలు చేస్తున్నారు. ట్రంప్ ఎప్పుడు ఎలా వ్యవహరిస్తారో అంతుచిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది. ఒకసారి ‘శాంతి దూత’నంటాడు.. ఇంకోసారి ‘యుద్ధమే శరణ్య’మంటాడు.. మరోసారి ‘అంతా తూచ్’ అంటాడు.. ‘కోతికి కొబ్బరి చిప్ప దొరికితే..’ అన్న చందంగా తయారైంది అమెరికా అధ్యక్షుడి తీరు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు.. ఆయన నిర్ణయాలు మొత్తం ప్రపంచానికే తలనొప్పిగా మారాయి. ట్రంప్ తలతిక్క నిర్ణయాలపై కలం 360 డిగ్రీస్ ప్రత్యేక కథనం..

- సెంట్రల్ డెస్క్, కలం

# మిస్టర్ టారిఫ్.. అట్టర్ ఫ్లాప్!

అమెరికాకు రెండోసారి అధ్యక్షుడిగా 2025 జనవరి 20న ట్రంప్ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత పదిహేను రోజులకు మీడియా ముందుకు వచ్చిన ఆయన 'యూనివర్సల్ టారిఫ్' అంటూ అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 10 శాతం సుంకాలను విధించారు. అనంతరం ఒక్కో దేశానికి ఒక్కోరకంగా పన్నులు వేయడం మొదలుపెట్టారు. ఏ దేశాన్నీ వదలలేదు. ట్రేడ్ డీల్ కుదుర్చుకుంటేనే టారిఫ్‌లు తగ్గిస్తామంటూ చెప్తూ వచ్చారు. ఇలా ఇండియాపై పరస్పర సుంకాలంటూ 25శాతం, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నదంటూ అదనంగా మరో 25 శాతం విధించారు. ఈ బెదిరింపులతో భారత్‌లోని చిన్న చిన్న వ్యాపారాలు కూడా దెబ్బతిన్నాయి. ఇలా దాదాపు ఏడాది పాటు టారిఫ్‌లతో వెంటాడారు. చివరికి గత ఫిబ్రవరి 7న అదనపు టారిఫ్‌ను ఎత్తివేశారు. పరస్పర సుంకం 25శాతం నుంచి 18 శాతానికి తెచ్చారు. ఎడాపెడా వేస్తున్న టారిఫ్‌లు చెల్లవంటూ అమెరికా సుప్రీంకోర్టు.. రీఫండ్ చేయాల్సిందేనంటూ ట్రేడ్ కోర్టు ట్రంప్‌కు తేల్చిచెప్పాయి. పక్కా బిజినెస్ మ్యాన్ అయిన ట్రంప్.. ఈ తీర్పులను లెక్క చేయడం లేదు. 'మిస్టర్ టారిఫ్' అంటూ తనను తాను సమర్థించుకుంటున్నారు. మరో మార్గంలో టారిఫ్‌లు వేస్తానంటూ బెదిరింపులకు దిగుతున్నారు. టారిఫ్‌లపై ప్రపంచ వ్యాప్తంగా నిరసన వెల్లువెత్తుతున్నది. సొంతదేశంలోనూ ఇదే సిచ్యువేషన్.





## టారిఫ్‌లతో వ్యాపారాలకు దెబ్బ

ఇండియా నుంచి అమెరికాకు ఏటా సుమారు రూ. 10 లక్షల కోట్ల వస్తువులు ఎగుమతి అవుతుంటాయి. ఇందులో గూడ్స్ వాటానే రూ. 7లక్షల కోట్ల వరకు ఉంటుంది. మిగతాది ఐటీ వంటి సర్వీసులకు సంబంధించింది. గూడ్స్‌లో మెడిసిన్స్, జువెలరీ, ఆటోమొబైల్స్ విడిభాగాలు, దుస్తులతోపాటు బాస్మతి బియ్యం, గోధుమలు పసుపు, మిర్చి వంటివి కూడా ఉన్నాయి. తెలంగాణ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువుల విలువ రూ. 30వేల కోట్ల వరకు ఉంటుంది. ఇందులో మెడిసిన్స్, రైస్, నిజామాబాద్ పసుపు, వరంగల్ మిర్చి వంటివి ఉన్నాయి. వీటిపై ట్రంప్ సుంకాలు వేయడంతో.. మనం ఎగుమతి చేయాలంటే ఆ సుంకాలను చెల్లించాలి. అమెరికాలోని మనవాళ్లు వాటిని కొనుగోలు చేయాలన్నా ఎక్కువ ధర పెట్టాల్సిందే. దీని వల్ల తెలంగాణలోని పసుపు, మిర్చి, బాస్మతి రైస్ పండించే రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎక్కువగా అమెరికాకు దుస్తులు ఎగుమతి అవుతుంటాయి. టారిఫ్ ల ప్రభావంతో ఆయా రాష్ట్రాల్లో టెక్స్ టైల్ ఇండస్ట్రీ దెబ్బతిన్నది.



## యుద్ధంతో సామాన్యులపై పెనుభారం..

ఇరాన్‌పై ట్రంప్ కయ్యానికి కాలు దువ్వడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమైంది. ఇరాన్, అమెరికా యుద్ధ ప్రభావం అన్ని దేశాలపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇది ఇండియాపై మరీ ఎక్కువగా ఉన్నది. క్రూడాయిల్, ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ దిగుమతులపైనే భారత్ ఆధారపడుతున్నది. వార్ కారణంగా సప్లై చెయిన్ దెబ్బతిని పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ, ఎల్ఎన్‌జీకి కొరత ఏర్పడింది. ఇది పరిశ్రమలు, హోటళ్ల నుంచి వంటిల్లు వరకు ప్రభావం చూపుతున్నది. సామాన్యులపై పెనుభారం మోపుతున్నది. ఇప్పటికే ఎల్పీజీ, పవర్ పెట్రోల్, బల్క్ డీజిల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం పెంచింది.

- బుక్ చేసిన 20 రోజులకు గానీ డొమెస్టిక్ సిలిండర్ రావడం లేదు. జనం సిలిండర్ కోసం గ్యాస్ ఏజెన్సీల ముందు క్యూలు కడుతున్నారు. చాలామంది ఇండక్షన్ స్టవ్‌లు కొనుగోలు చేసి వాడుకుంటున్నారు.
- కమర్షియల్ సిలిండర్ల కొరతతో హైదరాబాద్ సహా చాలా సిటీల్లో హోటల్స్ బంద్ అయ్యాయి. అక్కడక్కడ కొన్ని నడిచినా రేట్లు పెంచేశారు. టిఫిన్ మొదలు బిర్యానీ వరకు అన్నీ ధరలు పెరిగిపోయాయి.
- గ్యాస్ కొరత కారణంగా టెక్స్‌టైల్ ఇండస్ట్రీ తీవ్రంగా దెబ్బతిన్నది. దీనికి ఫేమస్ అయిన సూరత్‌లో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. అక్కడ ఉపాధి పొందుతున్న అనేక మంది తెలంగాణ వాసులు పని లేక సొంతూళ్ల బాట పట్టారు.
- డీజిల్ కొరత, ధరల పెంపు ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలోని మత్స్యకారుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నది. ఖర్చులు పెరిగిపోవడంతో చాలామంది బోట్లను ఒడ్డుకే పరిమితం చేస్తున్నారు.
- సప్లయ్ చెయిన్ దెబ్బతినడంతో భారత్ దిగుమతి చేసుకునే వస్తువుల ధరలన్నీ పెరిగిపోయాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్, పప్పులు, గోధుమలు తదితర నిత్యావసరాల రేట్లు మండిపోతున్నాయి.
- మెడిసిన్స్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాల ధరలూ పైకి ఎగబాకాయి. ఎల్ఎన్‌జీ కొరతతో యూరియా ప్లాంట్లు పూర్తి స్థాయిలో నడవక యూరియా తయారీ తగ్గిపోయింది. అటు దిగుమతుల్లేక, ఇటు తయారీ లేక వానాకాలంలో ఎరువుల కొరత ఏర్పడే ముప్పు ఉంది.
- గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు మూతపడి స్విగ్గీ, జొమాటో లాంటి ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్‌కు ఆర్డర్లు తగ్గిపోయాయి. వీటిపై ఆధారపడి బతుకుతున్న గిగ్ వర్కర్లు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డీజిల్, సీఎన్‌జీ కొరత కారణంగా ఉపాధి కోల్పోయి ఆటో డ్రైవర్లూ ఆర్థిక కష్టాలు పడుతున్నారు.



## ఇండియన్లపై 'హెచ్1బీ' బాంబ్




ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారతీయులపై బాంబ్ పేల్చారు. హెచ్1బీ వీసాల ఫీజు పెంచి, రూల్స్ మార్చి.. ఇండియన్ల ఉపాధిపై దెబ్బకొట్టారు. హెచ్1బీ వీసాలతో అమెరికాలో ఉద్యోగాలు పొందుతున్న వాళ్లలో భారతీయులు మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో ప్లేసులో ఉంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్ (ఎస్‌టీఈఎం) రంగాల్లో ప్రతిభావంతులైన ఉద్యోగుల కోసం హెచ్1బీ వీసా ప్రోగ్రామ్ తెచ్చామని, కానీ దీని ద్వారా తక్కువ జీతానికే పనిచేసే ఉద్యోగుల ప్రవాహం పెరిగిందని ట్రంప్ విమర్శించారు. విడతల వారీగా హెచ్1బీ రూల్స్‌ను కఠినతరం చేశారు.

- గతంలో హెచ్1బీ వీసా ఫీజు 15 వేల డాలర్లు ఉండేది. దాన్ని ఏకంగా లక్ష డాలర్లకు పెంచుతూ 2025 సెప్టెంబర్ 21న ట్రంప్ ఆదేశాలిచ్చారు.
- గతంలో హెచ్1బీ వీసాలకు లాటరీ విధానం ఉండేది. దాన్ని ట్రంప్ రద్దు చేశారు. 2026 ఫిబ్రవరి 27 నుంచి 'వెయిటెడ్ సెలక్షన్' ప్రక్రియను అమల్లోకి తెచ్చారు. అంటే ఎక్కువ నైపుణ్యం ఉండి, ఎక్కువ జీతం తీసుకునే వారికే హెచ్1బీ వీసాలు జారీ చేస్తారు.
- ట్రంప్ నిర్ణయాలతో ఇండియన్ ఫ్రెషర్లకు అమెరికాలో ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారింది. వీసా ఫీజు లక్ష డాలర్లకు తోడు అధిక జీతం చెల్లించి జూనియర్లను తీసుకోవడం ఐటీ కంపెనీలకు భారంగా మారింది. దీంతో ఇన్ని రోజులు హెచ్1బీ వీసాపై ఎంట్రీ లెవల్ ఉద్యోగులను తీసుకున్న కంపెనీలు.. ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో సీనియర్లను మాత్రమే తీసుకోవాల్సి వస్తున్నది. ఇది ఫ్రెషర్లకు శాపంగా మారింది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా ఐటీ ఇండస్ట్రీలో ఉద్యోగాలు పోతున్నాయి. కంపెనీలు వేలల్లో లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి. ఈ లేఆఫ్స్ ప్రభావం కూడా హెచ్1బీ హోల్టర్లపైనే ఎక్కువగా పడుతున్నది. అమెరికాలో హెచ్1బీ వీసాపై పని చేస్తున్న ఐటీ ఎంప్లాయ్.. జాబ్ కోల్పోతే 60 రోజుల్లోగా మరో కంపెనీలో చేరాలి. లేదంటే ఆ వీసా రద్దవుతుంది. యూఎస్ నుంచి తిరిగిరావాల్సి ఉంటుంది.
- హెచ్1బీ హోల్డర్లు ఎక్కువగా సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, ఎంట్రీ/మీడియం లెవల్ రోల్స్‌లో ఉంటారు. ఏఐతో ఇవే రీప్లేస్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో వాళ్లపైనే ఎఫెక్ట్ పడుతున్నది.
- చాలా మంది హెచ్1బీ హోల్డర్లు ఇండియాలో ఇరుక్కుపోయారు. వాళ్ల వీసా స్టాంపింగ్/రెన్యూవల్ అపాయింట్‌మెంట్‌లు క్యాన్సల్ అయ్యాయి.

## గల్ఫ్‌లో వలస జీవులు బిక్కుబిక్కు



గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన తెలంగాణవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ఎప్పుడేం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడెక్కడి నుంచి బాంబు వచ్చి పడుతుందో తెలియక అనుక్షణం భయంభయంగా బతుకు వెళ్లదీస్తున్నారు. ఉపాధి కోసం వెళ్లిన వేలాది మంది తెలంగాణ వాసులు యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, బహ్రెయిన్‌లో పని చేస్తున్నారు. అమెరికా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని యూఎస్ స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దీంతో గల్ఫ్‌లోని తమవాళ్ల యోగక్షేమాలపై ఇంటి దగ్గర ఉన్నవాళ్లు ఆందోళన చెందుతున్నారు.



అమెరికాలోని మిన్నెసోటాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా రోడ్డెక్కిన జనం

# వరస్ట్ ప్రెసిడెంట్..!

## అమెరికన్స్ మాట ఇది.. పలు సర్వేల్లో వెల్లడి

అమెరికా దేశ చరిత్రలో అత్యంత వరస్ట్ అధ్యక్షుడు ఎవరంటే.. ఇప్పుడు అమెరికన్ల నోట వస్తున్న పేరు 'డొనాల్డ్ ట్రంప్'! 40 శాతం మంది అమెరికన్లు ఇదే చెప్తున్నారని యాహూ, యుగోవ్ అనే సంస్థలు ఇటీవల చేసిన సర్వేలో వెల్లడైంది. ట్రంప్‌ను సమర్థించే వారు చాలా తక్కువ అని తేలింది. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలను అమెరికన్లు తప్పుబడుతున్నారు. 'అమెరికా ఫస్ట్' అనే ట్రంప్ నినాదం బాగున్నప్పటికీ ఆయన అనుసరిస్తున్న తీరే ఆందోళన కలిగిస్తున్నదని.. ముఖ్యంగా ఇతర దేశాల విషయంలో దుందుడుకు చర్యలు తమను కూడా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయని, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని మెజార్టీ అమెరికన్లు అభిప్రాయపడుతున్నారు.

- 'ది ఎకానమిస్ట్' తాజా రేటింగ్ ప్రకారం.. ట్రంప్ నెట్ అప్రూవల్ రేటింగ్ మరో 2 పాయింట్లు పడిపోయింది. 58 శాతం మంది అమెరికన్లు ట్రంప్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ఇందులో తేలింది. నెల క్రితం వరకు 56 శాతం మంది ఆయనను వ్యతిరేకించేవారు. యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ రేటింగ్‌లోనూ ఇదే తేలింది.
- ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో అమెరికా ఎకానమీ ఘోరంగా దెబ్బతింటున్నదని... ఆర్థిక వ్యవస్థను హ్యాండిల్ చేయడంలో ట్రంప్ విఫలమయ్యారని సీఎన్ఎస్ సంస్థ తాజా సర్వేలో వెల్లడైంది.

### వార్‌పై ఫైర్

నెల రోజుల నుంచి ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం విషయంలో ట్రంప్ తీరును అమెరికన్లు వేలెత్తి చూపుతున్నారు. వార్‌కు, ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలోని పలు నగరాల్లో జనం రోడ్ల మీదికి వస్తున్నారు. యుద్ధం ఆపాలంటూ నినాదాలు చేస్తున్నారు. ట్రంప్ టారిఫ్‌లతోపాటు హెచ్ 1 బీ వీసా విధానంలో ఆయన తెచ్చిన మార్పులను కూడా అక్కడి వాళ్లు వ్యతిరేకిస్తున్నారు.



వాషింగ్టన్‌లో ట్రంప్‌కు వ్యతిరేకంగా జనం నిరసన

## శాంతి అంటూనే యుద్ధాలు..

ట్రంప్ తనను తాను ప్రపంచ శాంతిదూతగా అభివర్ణించుకుంటున్నారు. 8 నెలల్లో 8 యుద్ధాలు ఆపానని చెబుతున్నారు. నోబెల్ శాంతి బహుమతి తనకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని దేశాలతో మద్దతు కూడా ఇప్పించుకున్నారు. చివరకు నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంతో నోబెల్ కమిటీనే విమర్శించారు. ఓవైపు తనది శాంతి మంత్రమని చెప్పే ట్రంప్.. మరోవైపు తానే యుద్ధాలకు కారణమవుతున్నారు.

- ట్రంప్ ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై భీకర దాడులు చేస్తున్నారు.
- డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించారు.
- అమెరికాలోకి డ్రగ్స్ డంప్ చేస్తున్నారని వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో నివాసంపై దాడి చేశారు. మదురో, ఆయన భార్యను బంధించి యూఎస్ తీసుకెళ్లారు.
- డ్రగ్ కార్టెల్, అక్రమ వలసల ఆరోపణలతో నిత్యం మెక్సికోతో ఘర్షణ పడుతున్నారు.


ట్రంప్‌కు నోబెల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇజ్రాయెల్ ప్రధాని నెతాన్యాహు ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఏఐ ఫొటో